
సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 16 । జూలై । 2023

గరిష్టం/కనిష్టం
31.0 /25.0

వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

కెరమెరి మండలంలోని బాబేఝరి జలపాతం



జల జల.. జలపాతం..

సండే స్పెషల్

- ఆకర్షిస్తూ.. మదిని దోచేస్తూ
- పర్యాటకుల తాకిడి మరూ
- వాటర్‌ఫాల్స్‌కు కేరాఫ్‌గా ఉమ్మడి ఆదిలాబాద్

అడవుల జిల్లా ఆదిలాబాద్.. ప్రకృతి అందాలకు నెలవు. వానాకాలం వచ్చిందంటే చాలు ఇక్కడ జల సోయగాలు కనువిందు చేసేస్తాయి. కొండకోనల మీదుగా జాలువారే సెలయేళ్లు.. పాలనురుగులా పర వళ్లు తొక్కే జలధారలు ప్రత్యేకం. సహజ సిద్ధ జలపాతాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది ఉమ్మడి జిల్లా. ఇక్కడ పర్యాటకులను ఆకర్షించే కుంటాల.. కనువిందు చేసే పొచ్చర, గాయత్రి, కనకాయి, చింతలమాదర, మిట్టె (సప్తగుండాల), వాస్తాపూర్ స్పెష లాట్రాక్షన్. ప్రస్తుతం వీటికి పర్యా టకుల తాకిడి పెరిగింది. అయితే ఇవి ఎక్కడెక్కడ ఉన్నాయి.. ఎలా చేరుకోవాలి.. వంటి వివరాలతో సండే స్పెషల్.



ప్రకృతి ఒడిలో.. పొచ్చర



జలపాతం వద్ద వనదేవత విగ్రహం

బోథ్: మండలంలోని పొచ్చర జలపాతానికి మంచి పిక్నిక్ స్పాట్‌గా పేరుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన గంగాదేవి, వన దేవత విగ్ర హాలు ప్రత్యేక ఆకర్షణ. వాటర్‌ఫాల్ వద్ద పర్యా టక శాఖ ఆధ్వర్యంలో కుటీరాలు ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకోవడానికి ఊయలలు అం దుబాటులో ఉన్నాయి. నేరడిగొండ నుంచి బోథ్ మార్గంలో నాలుగు కిలోమీటర్లు వెళితే బోథ్ ఎక్స్ రోడ్డు వస్తుంది. అక్కడి నుంచి మరో నాలుగు కిలోమీటర్లు వెళితే జలపాతానికి దారి కనిపిస్తుంది. ఇక్కడి వరకు ఆర్టీసీ సదుపాయం ఉంది. అక్కడి నుంచి కిలోమీటర్ వెళితే జలపాతానికి చేరుకోవచ్చు.

కనువిందు చేసే.. గాయత్రి

ఇచ్చోడ: మండలంలోని గుండివాగు గ్రామ సమీపంలో రెండు భారీ కొండల మధ్య ఈ జల పాతం ఉంది. దాదాపు 350 అడుగులపై నుంచి జలసోయగం కనువిందు చేస్తోంది. మండలకేం ద్రం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇచ్చోడ వరకు మాత్రమే ఆర్టీసీ సౌకర్యం అందు బాటులో ఉంది. అక్కడి నుంచి మేడిగూడ వరకు 8 కిలోమీటర్ల బీటీరోడ్డు, మరో నాలుగు మీటర్లు మట్టిరోడ్డుపై ప్రైవేట్ వాహనాల్లో చేరుకోవచ్చు.



జలపాతం వద్ద రాత్రి బస చేసేందుకు ఎలాంటి సౌకర్యాలు లేవు.

ఎంతో హాయి.. కనకాయి

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో గల ఈ జలపాతం వర్షా కాలం ప్రారంభం నుంచి ఆరు నెలల పాటు కను విందు చేస్తుంది. ఇచ్చోడ నుంచి బజార్‌హత్నూర్ వచ్చే మార్గంలో గిర్నూర్‌కు చేరుకోవాలి. ఇక్కడి వరకు ఆర్టీసీ సదుపాయం ఉంది. అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు వెళితే జలపాతం చేరుకోవచ్చు. సమీపంలోనే బంద్రేవ్ జలపాతం, లోతైన రాతి



లోయలు, అతిపురాతన కనకదుర్గ ఆలయం కూడా సందర్శించవచ్చు.

నిర్మల్ జిల్లాలో.. వాస్తాపూర్



నిర్మల్: జిల్లాలో ఏకైక జలపాతం.. వాస్తాపూర్. నిర్మల్ నుంచి మామడ మండలంలోని తాండ్ర గ్రామం మీదుగా వెళితే ఇక్కడికి చేరుకోవచ్చు. ఎన్.హెచ్.44 బైపాస్ నుంచి కేవలం 5కి.మీ. మాత్రమే. నిర్మల్ నుంచి 20 కి.మీ. వరకు వస్తుంది. ఇక్కడ ఎలాంటి వసతులు లేవు.



జలధారలతో పరవళ్లు తొక్కుతున్న కుంటాల జలపాతం



'కుంటాల'కు జలకళ

నేరడిగొండ: రాష్ట్రంలో రెండో ఎత్తైన జల పాతం.. కుంటాల. సుదూర ప్రాంతాల నుం చి పర్యాటకులు ఇక్కడికి తరలివస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలతో జలకళ సంతరిం చుకుంది. ఏకో టూరిజం ఆధ్వర్యంలో పర్యవే క్షణ చేపడుతున్నారు. ఇక్కడ నాలుగు ప్రైవేట్ హోటళ్లు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా నేరడి గొండ మండల కేంద్రం నుంచి 12 కిలోమీట ర్ల దూరం వెళితే దట్టమైన అటవీ ప్రాంతంలో దర్శనమిస్తోంది. నేరడిగొండ వరకు ఆర్టీసీ సదుపాయం ఉంది. అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాలి.

రోప్‌వే ఏర్పాటు చేయాలి



కుంటాల జల పాతాన్ని చూసేందుకు కరీంనగర్ నుంచి స్నేహి తులతో కలిసి వచ్చాం. వాటర్‌ఫాల్ బాగుంది. అయితే 408 మెట్లు దిగితేనే జలపాతం వీక్షించే అవకాశం ఉంది. వృద్ధులు, చిన్నారులు, మహిళ లు మెట్లు దిగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోప్‌వే ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పర్యాటకుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుంది. – పర్యాటకులు, కరీంనగర్

రిసార్ట్ ఏర్పాటు చేయాలి



దూర ప్రాంత పర్యా టకుల సౌకర్యార్థం కుంటాల జలపాతం వద్ద హరిత హోటల్స్, రిసార్ట్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. జల పాతం విశిష్టతను తెలిపేలా గైడ్‌లను నియమిస్తే ప్రమాదాలు సైతం చోటు చేసుకునే అవకాశం ఉండదు. – పర్యాటకులు, హైదరాబాద్

ప్రకృతి అందాలు బాగున్నాయి



పొచ్చర వద్ద ప్రకృతి అందాలు బాగు న్నాయి. నీటి పరవళ్ల శబ్దాలు వినసొంపుగా ఉన్నాయి. పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన కుటీరాలు బాగున్నాయి. కుటుంబంతో వచ్చి చూడాల్సిన ప్రాంతం ఇది. – ఉమాచరణ్, బాసర

అవగాహన కల్పిస్తున్నాం



చింతలమాదర జలపాతం వద్దకు చాలా మంది పర్యాటకులు వస్తుంటారు. వారికి జలపాతం వివరాలు తెలియ జేస్తా. ప్రమాదాలు జర గ కుండా అవగాహన కల్పిస్తా. గతంలో ఇక్కడ నీట మునిగి పలువురు మృత్యువాత పడిన నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉంటాం. – చిక్రం శంకర్, చింతలమాదర, తిర్యాణి

● 'మిట్టె' సవ్వడులు



చింతలమానెపల్లి: లింగాపూర్ మండ లం పిట్టగూడ సమీపంలో ఈ జలపాతం ఉంది. ఒకే ప్రవాహంపై ఒకదాని తర్వాత మరొకటి ఏడు జలపాతాలు ఉండ డంతో సప్తగుం డాల అని కూడా పిలుస్తారు. లింగా పూర్ నుంచి కాలినడకన రెండు కిలోమీటర్లు వెళితే ఇక్కడికి చేరుకోవచ్చు.

● మదిని దోచే.. 'చింతలమాదర'



తిర్యాణి మం డలం మంద గూడ గ్రామ పంచాయతీ లోని చింతల మాదర సమీపంలో ఉంది. తిర్యాణి మం డల కేంద్రం నుంచి 16 కి.మీ.లు ప్రైవేట్ వాహ నాల్లో వెళితే ఇక్కడికి చేరుకోవచ్చు.

● జాలువారే 'గుండాల'



తిర్యాణి మండలం గుండాల గ్రామ పంచాయతీలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. 50 అడుగుల కొండవాలు నుంచి జాలువారుతోంది. తిర్యాణి నుంచి 10 కి.మీ.ల దూరంలో గల రొంపల్లి వరకు వాహనాల్లో వెళ్లొచ్చు. తర్వాత దట్టమైన అడవిలో ఆరు కి.మీ.లు కాలినడకన వెళ్లాలి.

● వంద అడుగుల 'కొండెంగలొద్ది'



పెంచికల్‌పేట్ మండలం అగర్ గూడ అటవీ ప్రాంతంలో ఈ జలపాతం ఉంది. దాదాపు వంద అడుగుల ఎత్తునుంచి దూకే జలధార ఇది. పెంచికల్ పేట్ నుంచి అగ ర్‌గూడకు 7 కి.మీ.లు వాహ నంలో వెళ్లి, మరో ఐదు కి.మీ.లు నడవాలి.

● రెండు ధారల 'ఉల్లిపిట్ట'



తిర్యాణి మండ లం ఉల్లిపిట్ట గ్రామ పంచాయ తీలో ఈ జల పాతం ఉంది. మండల కేంద్రం నుంచి వాహ నాల ద్వారా 20 కిలోమీటర్లు వెళితే ఇక్కడికి చేరుకోవచ్చు. 20 అడుగుల నుంచి పడే రెండు ధార లు ఆకట్టుకుంటున్నాయి.

కుమురంభీం జిల్లాలో మరిన్ని..



కుండై జలపాతం

కెరమెరిలో 'బాబేఝరి', చింతలమానెపల్లిలోని శివపెల్లి, సిర్పూర్(యూ) మండలంలోని బాండే యేర్ అటవీప్రాంతంలో గల కుండై, కాగజ్‌నగర్ మండలంలోని ఊట్‌పల్లి, దరిగాం అటవీప్రాం తంలో దరిగాం, పెంచికల్‌పేట్ మండలం గుం డపెల్లి అటవీ ప్రాంతంలో గల దుద్దులాయి జల పాతం కుమురంభీం జిల్లాలో ఉన్నాయి.

న్యూస్‌రీల్

గ్రూపు-2 పరీక్షలకు పకడ్బందీ చర్యలు



పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుసూదన్

నస్పూర్: ఆగస్టు 29, 30వ తేదీల్లో గ్రూపు-2 పరీక్ష నిర్వహణకు అధికారులు పకడ్బందీ చర్య లు చేపట్టాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా అన్ని జిల్లాల అ దనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో పరీ క్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో 55 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 17,136 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. చెన్నూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవమయ్యేలా చూడాలి

చెన్నూర్‌రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవా లు అయ్యేలా చూడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చె న్నూర్, అంగ్రాజ్‌పల్లి, కోటపల్లి, వేమనపల్లి మండలాల ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల స మావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆ సుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడా లని, గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆయా మండ లాల వైద్యులు సత్యనారాయణ, ముస్తఫా, రాజేష్, హెచ్ఈవో జగదీశ్, హెల్త్ సూపర్‌వై జర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- అధికారులతో సమీక్ష సమావేశం



చెక్కు అందజేస్తున్న విప్ సుమన్, కలెక్టర్ సంతోష్

నస్పూర్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిం చడానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన మిషన్ భగీరథ నీరు పంపిణీలో నిర్లక్ష్యం తగ దని ప్రభుత్వ విప్ చెన్నూర్ బాల్క సుమన్ సూచిం చారు. శనివారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ బాదావత్ సంతోష్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, మిషన్ భగీరథ ఈఎస్‌సీ కృపాకర్‌రెడ్డితో కలిసి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 12,769 గ్రామాలకు సురక్షిత మంచినీటిని అందిస్తున్నామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఆగస్టు 15లోపు పెండిం గ్ పనులు పూర్తి చేయాలని అన్నారు. మిషన్ భగీరథ వల్ల దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేప ట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ ఈఎస్‌సీ కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళికతో నీటి సరఫరా జరుగుతోందని, సురక్షిత మంచినీటిని అందించే విధానాన్ని తమ తమ గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన ఫిల్టర్‌బెడ్‌ల వద్ద ప్రజలు ఎప్పటిక ప్పుడు పర్యవేక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఈ జ్ఞానకుమార్, ఈఈ అంజన్‌కుమార్, మధుసూదన్, పంచాయతీరాజ్ ఈఈ ప్రకాశ్, ఏఈలు, డీఈలు మున్సిపల్ కమిషనర్లు, చైర్‌పర్సన్ లు, వైస్ చైర్మన్‌లు, ఎంపీడీఓలు, ఎంపీపీలు, జెడ్పీ టీసీలు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్య

నస్పూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశా లల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యనం దిస్తున్నామని విప్ సుమన్ తెలిపారు. శనివారం ఆయన నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన శ్రీరాముల హరితకు కలె క్టర్ సంతోష్‌తో కలిసి రూ.5 లక్షల చెక్కును అందజే శారు. సుమన్ మాట్లాడుతూ వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి చెందిన హరిత మందమ ర్రిలోని మహాత్మా జ్యోతిభా పూలే కళాశాలలో 2022–23 విద్యాసంవత్సరంలో రాష్ట్ర స్థాయి ర్యాం కు సాధించడం అభినందనీయమని అన్నారు.

ధాన్యం డబ్బులకు ఎదురుచూపులే..!

- రెండు నెలలు గడిచినా రాలేదు
- మిల్లులకు ట్యాగింగ్ కాని ధాన్యం
- మూతపడనున్న ధాన్యం సేకరణ కమిషనరేట్ సైట్



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ధాన్యం విక్రయిం చిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. నెల న్నర నుంచి రెండు నెలలు కావస్తున్నా నగదు జమ కాకపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. ఏప్రిల్ 12 నుంచి జూన్ 11వరకు 262 కొనుగోలు కేంద్రాల్లో 31,496మంది రైతుల నుంచి రూ.371,00,93,328 విలువైన 1,81,867,320 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఈ నెల 15లోగా ఓపీఎంఎస్ ట్యాబ్ ఎంట్రీ అప్లికేషన్స్, మిల్లుల ట్యాగింగ్, పెండింగ్ ట్రక్‌షీట్, మిల్లు ట్రాన్సాక్షన్స్ అన్ని పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసర ఫరాల శాఖ కమిషనరేట్ ఆదేశాలు జారీ చేసింది. ఇంకా వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పెండింగ్ ట్రక్ షీట్, మిల్లు ట్రాన్సాక్షన్స్‌లో ఉంది. మిల్లుల లక్ష్యా లకు అధికంగా పంపించినట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని మిల్లులకు 45 వేల మెట్రిక్ టన్నులకు గాను 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించడం, మిల్లుల సామర్థ్యం కంటే అధికంగా తరలించడంతో మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వడం పెండిం గ్‌లో పెట్టడంతో ఇబ్బంది తలెత్తినట్లు తెలుస్తోంది. ఇంటర్మీడియెట్ గోదాముల్లో వేల మెట్రిక్ టన్నుల గోదాంల్లో ధాన్యం నిల్వ చేయడం మిల్లులకు ట్యాగింగ్ చేయలేదు. దీంతో ట్రక్‌షీట్ జనరేట్‌లో ఆలస్యమై రైతులకు నగదు జమ కాలేదు. ఇప్పటివ రకు 29,456 మంది రైతులకు రూ.345,51,19,624 నగదు ఖాతాలో జమ అయ్యింది. ఇంకా 2,040 మం దికి రూ.25,49,73,704 అందాల్సి ఉంది.

40 రోజులు గడిచింది..



గత నెలలో మండల కేంద్రంలోని సెంటర్ లో 300 బ్యాగుల ధా న్యం అమ్ముకున్న. రూ.2,45,000 వరకు అందాల్సి ఉంది. వారం రోజుల్లో పైసలు ఖాతాలో పడుతయ న్నరు. 40 రోజులు గడిచినా పడలేదు. గతం లో గిన్ని రోజులు ఎన్నడూ వడ్ల పైసల కోసం ఎదురు చూడలేదు. ఇప్పటికే వానకాలం సాగు ప్రారంభించినం. ఆలస్యం చేయకుండా పైసలు వేయాలి. – బొలిశెట్టి ఎల్లయ్య, దండేపల్లి

బీసీలు అన్ని రంగాల్లో ముందుండాలి

- తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర సలహాదారు కామెర్ల ఐలయ్య



నివాళులర్పిస్తున్న తెలంగాణ బీసీ జాగృతి నాయకులు

పాతమంచిర్యాల: బీసీలు అన్ని రంగాల్లో ముందుం డాలని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర సలహాదారు కామెర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని హెచ్‌బీ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో 'రాబోయే ఎన్నికల్లో బీసీల పాత్ర' అనే అంశంపై బీసీ సంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. మహాత్మా జ్యోతిభా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఐలయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీ సంఘాలన్నీ ఐక్యంగా ఉండి బీసీ ఎమ్మెల్యే అభ్యర్థిని నిర్ణయించుకోవాలని, ఏ పార్టీ టికెట్ కేటాయించినా మద్దతు తెలుపాలని అన్నారు. మంచిర్యాలలో లక్ష మందితో బీసీ గర్జన సమావేశం ఏర్పాటు చేసి బీసీ అభ్యర్థికే మద్దతు అని ప్రకటించాలని తెలిపారు. తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, ప్రైవేట్ విద్యాసంస్థల జిల్లా అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్, న్యాయవాది కర్రె లచ్చన్న, ప్రముఖ వైద్యులు డాక్టర్ రమణ, సీనియర్ బీసీ నాయకులు తులా మధుసూదన్, బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి బద్రి శ్రీనివాస్, నాయకులు మంచర్ల సదానందం, బొడ్డు శంకర్, దొమ్మటి సత్తయ్య, వైద్య భాస్కర్, బొలిశెట్టి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.


గాంధారి మైసమ్మ జాతరకు సిద్ధం



ముస్తాబైన మైసమ్మ ఆలయం

రామకృష్ణాపూర్: ఆషాఢ మాస బోనాల జాతరకు మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ దేవాలయం ముస్తాబైంది. వేలాది సంఖ్య లో భక్తులు తరలిరానుండడంతో ఆలయ కమిటీ అ న్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం 7 గంట ల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాతర సా గుతుంది. కోల్‌బెల్ట్ పరిసర ప్రాంతాలైన రామకృష్ణా పూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, నెన్నెల, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివ స్తారు. పూజల అనంతరం మేకలు, కోళ్లను బలి ఇ చ్చి వనభోజనాలు చేస్తారు. బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తును పర్యవేక్షిస్తారు.

'ఎల్లంపల్లి'లో పెరుగుతున్న నీటిమట్టం



ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద ఉన్న ఎల్లంపల్లి(శ్రీపాద సాగర్) ప్రాజెక్టులో నీటిమట్టం 15 టీఎం సీలకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎం సీలకు గాను శనివారం 14.850 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో కింద ఎగువ ప్రాంతాల నుంచి 331 కూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


గొర్రె పిల్లల వద్ద రోదిస్తున్న యజమాని

భీమిని: మండల కేంద్రానికి చెందిన ఎగ్గడి లింగయ్య గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా సుమారు 20కిపైగా మేక పిల్లలు మృతి చెందాయి. ఎగ్గడి లింగయ్య గొర్రెల మందతో భీమిని నుంచి కుమురంభీం జిల్లాలోని గజ్జిగూడం గ్రామం వైపు మేతకు వెళ్లగా శుక్రవారం కురిసిన భారీ వర్షానికి గొర్రె పిల్లలు ఒక గూడులో వేసి కవర్ కప్పి ఉంచాడు. రాత్రి సమయంలో కుక్కల మంద ఒక్కసారిగా గొర్రె పిల్లలపై దాడి చేసి హతమార్చాయి. సుమారు రూ.లక్ష 50 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు రోదిస్తూ పేర్కొన్నాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

పత్తి రైతు ఆత్మహత్య


అశోక్ (ఫైల్)

పెంబి: పత్తి విత్తనాలు మొలకెత్తలేవని రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెంబి మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రజినీకాంత్ వివరాల ప్రకారం... మండలంలోని లోతర్యతండా గ్రామానికి చెందిన గుగ్లావత్ అశోక్ (37) తనకున్న మూడెకరాలతో పాటు కౌలుకు తీసుకున్న మూడెకరాల్లో పత్తి విత్తనాలు నాటాడు. విత్తనాలు మొలకెత్తకపోవడంతో అప్పుగా తీసుకువచ్చిన పెట్టుబడి ఎలా తీర్చాలో తెలియక మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులోనే శనివారం ఉదయం ఇంటి వద్ద ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊరు మందమర్రికి చెందిన ఈద పుల్లయ్య (85) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం వెలుగుచూసింది. ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం... పుల్లయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన పుల్లయ్య తిరిగి రాలేదు. శనివారం ఉదయం పుల్లయ్యకు చెందిన పంట చేనువైపు వెళ్లిన వారికి ఉరేసుకుని కనిపించాడు. దీంతో వారు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై చేరుకుని వివరాలు సేకరించారు. అతడి కుమారుడు భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం...రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పై రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు రెఫర్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై టూటౌన్ ఎస్సై రవికుమార్‌ను వివరణ కోరగా రోడ్డు ప్రమాదం ఘటన తమ దృష్టికి రాలేదని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఎయిడ్స్ కేంద్రాల మూత

- ఉమ్మడి జిల్లాలో మూతపడనున్న ఐదు ఐసీటీసీ కేంద్రాలు
- హేతుబద్ధీకరణ పేరుతో కేంద్రం నిర్ణయం
- రోడ్డున పడనున్న ఉద్యోగులు
- ఆందోళనలో హెచ్‌ఐవీ బాధితులు



మూసివేయనున్న చెన్నూర్ ఐసీటీసీ కేంద్రం

చెన్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎయిడ్స్ పరీక్ష కేంద్రాలు మూతపడనున్నాయి. హేతుబద్ధీకరణ పేరుతో ఆ కేంద్రాలను మూసివేయాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర నిర్ణయంలో ఉమ్మడి జిల్లాలోని మొదటి దశ ఐదు ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ ట్రైనింగ్ సెంటర్ (ఐసీటీసీ) కేంద్రాలు మూతపడనున్నాయి. ఐసీటీసీ కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులు రోడ్డునపడే అవకాశాలు ఉన్నాయి. ఐసీటీసీ కేంద్రాలు లేకపోతే మా పరిస్థితి ఏమిటని హెచ్‌ఐవీ బాధితులు ఆందోళన చెందుతున్నారు.

మూతపడనున్న కేంద్రాలు..

ఉమ్మడి జిల్లాలో 17 ఐసీటీసీ కేంద్రాలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతో పాటు జిల్లా ఆస్పత్రి కేంద్రాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 17 కేంద్రాలలో హెచ్‌ఐవీ బాధితులు 16220 మంది ఉన్నారు. హేతుబద్ధీకణ పేరుతో జిల్లాలోని ఐదు కేంద్రాలకు తాళం పడనుంది. ఇందులో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 1, నిర్మల్ జిల్లాలో ఖానాపూర్, ముథోల్, మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, మందమర్రి కేంద్రాలను ఎత్తివేయనున్నారు. మూసివేసే ఐదు ఐసీటీసీ కేంద్రాల పరిధిలో 4500 మంది హెచ్‌ఐవీ బాధితులున్నారు. ఎయిడ్స్ పరీక్ష కేంద్రాలు మూసివేయడంతో పరీక్షలతో పాటు హెచ్‌ఐవీ సోకిన బాధితులకు మందుల పంపిణీకి చెక్‌పడనుంది. దీంతో హెచ్‌ఐవీ బాధితులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో హెచ్‌ఐవీ బాధితులకు నష్టం జరిగే అవకాశాలున్నాయి.

2004లో ప్రారంభం..

కేంద్ర ప్రభుత్వం ఎయిడ్స్ నియంత్రణకు జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీని 2004లో ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఐసీటీసీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించడం హెచ్‌ఐవీ బాధితులకు ఎయిడ్స్‌పై కౌన్సెలింగ్ ఇప్పించడం, భార్యాభర్తలకు వ్యాధిపై అవగాహన కల్పించడం, వ్యాధి నియంత్రణ మందులు ఇవ్వడం, అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా హెచ్‌ఐవీ పట్ల అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు.

నేషనలైజేషన్ పేరుతో...

నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ తరపున అన్ని జిల్లాలకు ఒక లేఖ రాసింది. గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న పరీక్షలు, వ్యాధి తీవ్రత, బాధితులు ఎంతమంది అనే విషయాలను ఇవ్వాలని కోరింది. జిల్లాల నుంచి వెళ్లి సమాచారాన్ని సేకరించి కేంద్రాన్ని పంపించింది. మూడేళ్లుగా తక్కువ పనితీరు ఉన్న కేంద్రాలను మూసివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఐసీటీసీ కేంద్రాలలో ఒక్క కౌన్సెలర్‌తో పాటు ఎల్‌టీ, జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటారు. ఉమ్మడి జిల్లాలో మొదటి దశలో ఐదు కేంద్రాలను మూతపడనున్నాయి. పది మందికి పైగా ఉద్యోగులకు రోడ్డున పడనున్నారు. హెచ్‌ఐవీ కేసులు తక్కువగా ఉన్నాయని కేంద్రాలను మూసివేయడం సరికాదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఓ వైపు హెచ్‌ఐవీ విస్తరిస్తుంటే మరో వైపు కేంద్ర ప్రభుత్వం ఐసీటీసీ కేంద్రాలను మూసే వేయాలని నిర్ణయించడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు.

టీఎన్జీవోస్‌కు రూమ్ కేటాయించాలని వినతి


విప్ సుమన్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా యూనియన్‌కు కొత్తగా నిర్మించిన కలెక్టరేట్ కార్యాలయంలో ఒక రూమ్‌ను కేటాయించాలని కోరుతూ శనివారం టీఎన్జీవోస్ నాయకులు ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ బదావత్ సంతోశ్‌లకు వినతి పత్రం అందించారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించి, ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో టీఎన్జీవోస్ కార్యాలయానికి రూమ్‌ను కేటాయించేందుకు ఒప్పుకున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి రాంమోహన్, హౌజింగ్ సొసైటీ కార్యదర్శి హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షులు మొండయ్య పాల్గొన్నారు.

రైలు ఢీకొని హిజ్రా మృతి

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతున్న క్రమంలో గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని హిజ్రా(35) శనివారం మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. రైలు పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహంపై లేత ఆకుపచ్చ రంగు జాకెట్, లేత ఆకుపచ్చ చీర ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యం

- తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

భీమారం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరువ చూపడం లేదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షులు సయింపు శ్రీనివాస్‌రావు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడితే ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశపడ్డారని, తెలంగాణ వచ్చి తొమ్మిదేళ్లు దాటుతున్నప్పటికీ సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకు కాంప్లెక్స్ స్థాయిలో టీచర్ల సంతకాల సేకరణ, 25న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన, 31న ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 5న కలెక్టరేట్ల వద్ద ధర్నా, అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆగస్టు 19న మహాధర్నా చేపట్టనున్నామని శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- బాలుడిని చితకబాదిన ఘటనపై విచారణ


విచారణ చేస్తున్న కమిటీ సభ్యుడు కేశవ్‌రావు

రెబ్బెన: రెబ్బెన మండలంలోని ఎడవెల్లిలో దళిత బాలుడు రొడ్డ ఉదయ్‌కిరణ్‌ను చితకబాదిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేగుంట కేశవ్‌రావు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై శనివారం విచారణ చేపట్టారు. దాడి గురించి బాలుడి అమ్మమ్మ, తల్లితో పాటు చుట్టు పక్కల ఉండే వారిని విచారించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన చిప్ప దిలీప్‌తో పాటు అతడి తల్లి చంద్రకళ, మామ లక్ష్మణ్‌తో పాటు మరికొంత మంది కిరాణ షాపు ఎదుట నుంచి వెళ్తున్న ఉదయ్‌కిరణ్‌ను చూసి దొంగ అంటూ పట్టుకుని విచక్షణ రహితంగా చితకబాదారు. బాలుడిపై దాడి చేయటమే కాక ఫెన్సింగ్ వైర్‌పై నుంచి కింద పడేయటంతో ఫిల్లర్ ఇనుపరాడ్ ఎడమ కంటిలో గుచ్చుకుని స్పృహతప్పి పడిపోవడాన్ని గమనించిన గ్రామస్తులు బాలుడి తల్లిదండ్రులకు తెలిపారు. బాలుడిపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దుర్గం ప్రభాకర్, దుర్గం నరేష్, ఇగురపు అజయ్, ఇప్ప అశోక్, లచ్చయ్య, సాలెం రాజ్, సుధీర్, ఈశ్వర్, ప్రవీణ్, శ్రీలత, సుజాత, శాంతలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ, పరిసర ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీకి చెందిన ఎండి బద్రుద్దిన్ అనే పాత నేరస్తుడు కూరగాయల మార్కెట్ ఏరియాలో శనివారం అనుమానస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా వరుస దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని పట్టుకున్న వన్‌టౌన్ పోలీసు సిబ్బంది సంపత్ కుమార్, రవి, గంగాధర్, రవికుమార్, రాజేష్, హోంగార్డులు తిరుపతి, సంపత్‌లను ఎస్‌హెచ్‌వో శంకరయ్య అభినందించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా దత్తు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా సిడం దత్తును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న భూసేకరణ, ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ఎల్లపల్లి ప్రాజెక్టు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు ఈ నెల 2న దేవరకొండ రెవెన్యూ డివిజన్ అధికారిగా బదిలీపై వెళ్లారు. నారాయణపేట్ జిల్లాలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న సిడం దత్తును భూసేకరణ, ఆర్‌అండ్ఆర్, ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

విద్యావలంటీర్ల నియామకంపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పొడిగించినందున పాఠశాలల్లో విద్యావలంటరీలను నియమించేలా చర్యలు తీసుకోవాలని టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో వర్క్ అడ్జస్ట్ చేయటంలో హైస్కూల్‌లో కొన్ని ప్రైమరీలో ఉపాధ్యాయుల కొరత ఇంకా ఉందని దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నత పాఠశాలలో బయోసైన్స్, సోషల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఎఫ్ఎల్ఎన్ ప్రొగ్రాంను హెచ్ఎం విధులను సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నారని విన్నవించారు.

ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


ఇంటర్వ్యూల సరళిని పరిశీలిస్తున్న తిరుపతివర్మ

- అదనపు కలెక్టర్ రాహుల్
- మంచిర్యాలలో మెగా జాబ్‌మేళా

పాతమంచిర్యాల: నిరుద్యోగులు ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో హైకోర్టు న్యాయవాది అక్కల తిరుపతివర్మ ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ మాట్లాడుతూ ప్రైవేటు రంగాల్లో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకుని జీవితంలో ఎదగాలని తెలిపారు. జాబ్‌మేళా నిర్వాహకుడు అక్కల తిరుపతివర్మ మాట్లాడుతూ జాబ్‌మేళాలో 8,889 మంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా 2,215 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారని, వీరిలో 824 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. కంపెనీల హెచ్‌ఆర్‌ల సమక్షంలో నియామక పత్రాలు అందజేశారు. మున్సిపల్ వైస్‌చెర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, వైద్యులు రమణ, చుంచు రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

‘చంద్రయాన్–3’ ప్రయోగంలో మనోళ్లు


గోవర్ధన్

బెల్లంపల్లి/తాండూర్: చంద్రయాన్–3 రాకెట్ తయారీ, ప్రయోగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులూ భాగస్వామ్యం అయ్యారు. శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బందిలో తమ తమ పాత్ర పోషించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాల్టీ షంషీర్‌నగర్‌బస్తీకి చెందిన పత్తిపాక గోవర్ధన్ మూడు దశల ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ చంద్రయాన్–3 త్రీ ఇన్ వన్ మిషన్ తయారీ శాస్త్రవేత్తల బృందంలో ఒకరిగా ఉన్నారు. గోవర్ధన్ కుటుంబం తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో మొదట నివాసం ఉండగా.. 20ఏళ్ల క్రితం బెల్లంపల్లికి మకాం మార్చారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు మాదారంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియెట్, డిగ్రీ బెల్లంపల్లిలో పూర్తి చేశారు. ఉన్నతవిద్య కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఇస్రోలో శాస్త్రవేత్తగా చేరారు. ఇప్పటికే పలు ప్రయోగాల్లో పాలుపంచుకున్నారు. గోవర్ధన్ ‘సాక్షి’తో మాట్లాడుతూ చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడం ఆనందాన్ని కలిగించిందని అన్నారు. తన పాత్ర అత్యల్పమే అయినా దేశపౌరుడిగా గర్వంగా ఉందని తెలిపారు.

కాగజ్‌నగర్ వాసి


బాలకుమార స్వామి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌కు చెందిన బాలకుమారస్వామి 13 ఏళ్ల క్రితం శ్రీహరికోటలోని ఇస్రోలో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం ఆయన పదోన్నతి పొంది టెక్నికల్ ఆఫీసర్‌గా సేవలు అందిస్తున్నారు. చంద్రయాన్–3 చివరి దశ క్రయోదశ, రాకెట్ ప్రయోగంలో అతి శీతల ద్రవ ఇంధనాలను నిల్వ చేయడం, ఇతర సర్వీస్‌లు ప్రధానం. కౌంట్‌డౌన్ ప్రారంభం నుంచి 10 గంటల్లో పని పూర్తి చేయాల్సిన బృందంలో బాలకుమారస్వామి ఒకరిగా ఉన్నారు. పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి పదవ తరగతి వరకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు.

ఓపెన్ ప్లాట్లు.. మురికి కూపాలు


చెన్నూర్ పాత బస్టాండ్‌లో ఓపెన్ ప్లాట్‌లో నిలిచిన వర్షపు నీరు

- ముళ్ల పొదలతో అడవిని తలపిస్తున్న తీరు..
- వర్షంనీరు నిలిచి కుంటలను తలపిస్తున్న వైనం
- దోమలతో రోగాలపాలవుతున్న స్థానికులు


చెన్నూర్ శివాలయం వెళ్లే దారిలో..

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓపెన్ ప్లాట్లు మురికి కూపాలను తలపిస్తున్నాయి. ఓపెన్ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి, చిట్టడవిగా మారాయి. వర్షపు నీరు నిలువడంతో చెత్తా చెదారంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది ఆయా కాలనీ వాసులు రోగాల బారినపడుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

మున్సిపాలిటీలో ఇలా..

చెన్నూర్ మున్సిపాలిటీ 18 వార్డులు ఉండగా 23,547 జనాభా, 6735 నివాస గృహాలు ఉన్నాయి. ప్రతీ వార్డులో ఒక్కటి నుంచి రెండు, మూడు ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. ఖాళీ ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. అలాగే వర్షం నీటితో కుంటలను తలపిస్తున్నాయి.

మున్సిపాలిటీలో ...

మున్సిపాలిటీ పరిధిలోని లైన్‌గడ్డ, పాత బస్టాండ్, శివాలయం వెళ్లేదారిలో, లయోల స్కూల్ సమీపంలో, చర్చి రోడ్డులో రెండు ఖాళీ ప్లాట్లు దర్శనమిస్తున్నాయి. పాత సినిమా టాకీస్ నుంచి కొత్తగూడెం వెళ్లేదారిలో రెండు ఖాళీ ప్లాట్లు ఉండగా పుప్పాల హనుమాన్ వీధిలో రెండు, రౌండ్ హనుమాన్ టెంపుల్, దుబ్బాగూడెంలో ఒకటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. ఇందులో చెత్తాచెదారంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.

శుభ్రం చేయిస్తాం..



ఓపెన్ ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇచ్చాం. యజమానులు స్పందించకపోతే మున్సిపాల్ సిబ్బందితో ఓపెన్ ప్లాట్లను శుభ్రం చేసి కార్మికుల ఖర్చు రెండింతలను యజమానుల వద్ద నుంచి వసూలు చేస్తాం. ఇంటి యజమానులు మున్సిపల్ అధికారులకు సహకరించాలి. ప్రజల ఆరోగ్యం కోసం ఓపెన్ ప్లాట్లను శుభ్రంగా ఉండేలా చూడాలి.

– గంగాధర్, మున్సిపాల్ కమిషనర్, చెన్నూర్

ఆరోగ్య కిట్ బంద్.. డబ్బులు రావు..!

- ఏళ్లు గడిచినా పట్టింపేది..?
- బాలికలకు తప్పని ఎదురుచూపులు


ఆరోగ్య పరిశుభ్రత కిట్‌లో వస్తువులు

మంచిర్యాలఅర్బన్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఆరోగ్య కిట్ బంద్ అయింది. అటు కాస్మొటిక్ కిట్లకు సంబంధించిన డబ్బులూ రాని పరిస్థితి నెలకొంది. కేజీబీవీల్లో నిరుపేద, అనాథలు బాలికలు అధిక సంఖ్యలో ఉంటారు. వీరికి వసతితోపాటు భోజనం, పుస్తకాలు, దుప్పట్లు, దుస్తులు ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోంది. మొదట్లో ప్రతినెలా రూ.100 చొప్పున కాస్మొటిక్ ఛార్జీలు అందించేవారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి, పేదరికం వల్ల ఎంతోమంది విద్యార్థినులు అనారోగ్యాల బారిన పడిన నేపథ్యంలో ప్రభుత్వం వారి కోసం ప్రత్యేకంగా పరిశుభ్రత కిట్లు(కాస్మొటిక్ కిట్లు) పంపిణీ చేపట్టింది. కరోనా ముందు వరకు పరిశుభ్రత కిట్లు(హెల్త్ హైజెనిక్) ఇచ్చారు. కరోనా తర్వాత వీటి స్థానంలో కరోనా ఏటేటా ప్రవేశాలు పెరుగుతున్న పిల్లలకు అందించే ఆరోగ్య కిట్లు అందకుండా పోయాయి. గతేడాది నెలకు రూ.100 చొప్పున విద్యార్థినుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు వివరాలు సేకరించారు. ఏళ్లు గడుస్తున్నా ఆరోగ్య కిట్లు రాక.. నగదు చెల్లింపులేక విద్యార్థినులపై ఆర్థిక భారం పడుతోంది. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమై నెలన్నర కావస్తున్నా ఊసలేకుండా పోయాయి.

ఆరోగ్య కిట్లు పంపిణీ ఇలా..

జిల్లాలో 18 కేజీబీవీలు ఉన్నాయి. 4,230 మంది బాలికలు అభ్యసిస్తున్నారు. వీరందరికీ విద్యతోపాటు ఆరోగ్య కిట్లను పంపిణీ చేస్తూ వచ్చారు. మూడు నెలలకొకసారి అందించాల్సి ఉంది. ఇందులో బాత్‌సోప్స్–3, డిటర్జెంట్ సోప్స్–3, హెయిర్ ఆయిల్ బాటిల్–1, శాంపో బాటిలు–1, పౌడర్–1, టూత్‌పేస్ట్–1, టంగ్ క్లీనర్–1, దువ్వెన–1, జడక్లిప్పులు, జడ రబ్బర్లు, బొట్టు బిల్లల ప్యాకెట్, సానిటరీ న్యాపికిన్లతోపాటు 16రకాల వస్తువులు అందజేశారు. కరోనా తర్వాత కాలంలో రూ.100 చొప్పున నగదు అందించేందుకు చర్యలు చేపట్టారు.

ఎదురు చూపులు..

బాలికల ఆరోగ్య సమస్యలను దూరం చేయటానికి 2017–18 విద్య సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 16 రకాల వస్తువులతో హెల్త్ కిట్లు అందజేస్తున్నారు. అంతకుముందు నెలకు రూ.100 చోప్పున అందజేసేవారు. తర్వాత కాలంలో విద్యార్థినులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో నగదుకు బదులు ఆరోగ్య పరిశుభ్రత కిట్లు పంపిణీ చేస్తూ వచ్చింది. ప్రస్తుతం మళ్లీ విద్యార్థినులు బ్యాంకు ఖాతాలు తెరవాలని ఆదేశాలు వచ్చాయి. ఖాతాలు తెరిచిన వారందరికీ రూ.100 నగదు వేయాలని నిర్ణయించారు. పస్తుతం మార్కెట్లో ధరలు చూస్తే ఒక కొబ్బరి నూనె డబ్బాకు రూ.100కు పైగా ఉంది. దీనిని బట్టి ప్రభుత్వం అందించే డబ్బులు ఎలా సరిపోతాయో తెలియని పరిస్థితి. ప్రభుత్వం ఇచ్చే కిట్టు దాదాపు రూ.750 పైన మాట. ఈ లెక్కన ప్రభుత్వం రూ.100 చెల్లించే నగదుతో ఆరోగ్య కిట్లు కొనడం కష్టమే. ప్రస్తుత ధరలకు అనుగుణంగా నగదును ఖాతాలో జమ చేయాలని డిమాండ్ పెరుగుతోంది.

త్వరలోనే నగదు జమ

బాలికలకు అందజేసే ఆరోగ్య కిట్లు సరఫరా కాలేదు. విద్యార్థినులకు రూ.100 చొప్పున స్టైఫయిండ్ ఇచ్చే అవకాశాలున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశానుసారం బ్యాంకు ఖాతాలు తెరిచి విద్యార్థుల వివరాలు సేకరించి నివేదించాం. త్వరలోనే చార్జీలు ఖాతాల్లో జమ కానున్నాయి.

– పద్మజ, సెక్టోరల్ అధికారి, మంచిర్యాల